ఈవీఎం డాటా తొలగించొద్దు!

- ఈవీఎం ట్యాంపరింగ్ జరిగినట్టు అభ్యర్థి ఆరోపిస్తే, ఇంజినీర్‌తో చెక్ చేయించాల్సిందే
- ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు ఆదేశాలు
- 'డాటా డిలీట్' ప్రక్రియ ఏమిటని ఈసీకి ప్రశ్న

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): ఎన్నికలు ముగిసిన తర్వాత ఈవీఎంలలో (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్) నిక్షిప్తమైన డాటాను తొలగించొద్దని ఎన్నికల సంఘానికి (ఈసీ) సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈవీఎం ట్యాంపరింగ్ జరిగినట్టు ఓటమిపాలైన అభ్యర్థి ఎవరైనా ఆరోపిస్తే, ఇంజినీర్ సమక్షంలో ఆ డాటాను విశ్లేషించాల్సిందేనని పేర్కొంది. ఎన్నికలు పూర్తైన తర్వాత ఈవీఎంలకు సంబంధించి ఎలాంటి నిర్దిత ప్రమాణాలు (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్లు-ఎస్‌వోపీలు) పాటిస్తున్నారంటూ ఈసీని ఈ సందర్భంగా ధర్మాసనం ప్రశ్నించింది. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్), హర్యానాకు చెందిన రాజకీయ నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది.

ఏమిటీ కేసు?

ఓట్ల లెక్కింపు పూర్తైన తర్వాత కూడా ఈవీఎంలలో డాటాను తొలగించకూడదని, ఈవీఎంలు ట్యాంపరింగ్‌కు గురికాలేదని నిరూపించడానికి ఈవీఎంలలోని మైక్రో కంట్రోలర్, బర్న్ మెమొరీని ఇంజినీర్ల బృందం చేత తనిఖీ చేయించాలని కోరుతూ ఏడీఆర్, కొందరు హర్యానా నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కోర్టు గత ఏడాది ఏప్రిల్‌లో ఇచ్చిన ఆదేశాలను ఈసీ పాటించాలని పిటిషన్‌లో కోరారు.

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

- ఓట్ల లెక్కింపు పూర్తైన తర్వాత కూడా ఈవీఎంలలో డాటాను తొలగించకూడదు. కొత్తగా ఏ సమాచారాన్ని జోడించకూడదు.
- ఈవీఎం ట్యాంపరింగ్ జరిగినట్టు ఎన్నికల్లో ఓటమిపాలైన అభ్యర్థి ఎవరైనా ఆరోపిస్తే ఇంజినీర్ల బృందం చెక్ చేయాల్సిందే.
- ట్యాంపరింగ్ ఆరోపణలు చేసిన అభ్యర్థి సమక్షంలో ఈవీఎంలను తయారు చేసిన సంస్థలు) చెందిన ఇంజినీర్లు ఈ తనిఖీలు చేపట్టాలి.
- ఆరోపించిన అభ్యర్థికి ఈవీఎం ట్యాంపరింగ్ జరుగలేదని నిరూపించాలి. అంతేగానీ, తనిఖీల పేరిట పూర్తి డాటాను డిలీట్ చేయడం ఎందుకు?
- అందుకనే.. తనిఖీల్లో భాగంగా ఈవీఎంలలోని అసలు డాటాను వెలికితీయడానికి ముందు ఆ డాటాను డమ్మీ ఈవీఎంలలో నిక్షిప్తం చేయాలి. ఆ తర్వాత ఇంజినీర్ల బృందం మైక్రో కంట్రోలర్, ఈవీఎంలలో బర్న్ చేసిన మెమొరీని తనిఖీ చేయాలి.
- ఈవీఎంలను వెరిపై చేయాలనుకొనే వారు రూ. 40 వేలను ఫీజుగా చెల్లించాల్సి ఉన్నది. ఇది చాలా ఎక్కువ. ఈ ఫీజును తగ్గించాలి.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన?

ఇంఫాల్, ఫిబ్రవరి 11: గత రెండేళ్లుగా తీవ్ర అశాంతి నెలకొన్న బీజేపీ పాలిత మణిపూర్‌లో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ఆదివారం రాజీనామా చేయడంతో రాజకీయంగా అనిశ్చితి ఏర్పడింది. ఇప్పటికే సీఎం రాజీనామాను ఆమోదించిన గవర్నర్ అజయ్ కుమార్ భల్లా తదుపరి నియామకం జరిగే వరకు తాత్కాలిక సీఎంగా వ్యవహరించాలని బీరేన్‌ను కోరారు. అయితే రాష్ట్రంలోని పరిస్థితులపై గవర్నర్ పంపిన నివేదికలో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనకు సిఫార్సు చేయాలని కోరినట్టు తెలిసింది. సోమవారం నుంచి జరగాల్సిన అసెంబ్లీ సమావేశాలను రద్దు చేస్తూ గవర్నర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. బీరేన్ సింగ్ తర్వాత ముఖ్యమంత్రిగా ఎవరినీ ఎంపిక చేయాలో బీజేపీ అధిష్ఠానం తేల్చుకోలేకపోతున్నది. దీంతో కేంద్రానికి రాష్ట్రపతి పాలన విధించడమొక్కటే ప్రత్యామ్నాయంగా కన్పిస్తున్నది.

జేఈఈలో తెలంగాణ విద్యార్థి సత్తా

- బనిబ్రత మజీకి వంద శాతం మార్కులు
- మెయిన్ సెషన్-1 ఫలితాలు విడుదల
- దేశవ్యాప్తంగా 14 మందికి వంద పర్సెంటైల్
- రాజస్థాన్ నుంచి అత్యధికంగా ఐదుగురు
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక్కొక్కరు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): జేఈఈ మెయిన్ సెషన్-1 ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. తెలంగాణ విద్యార్థి బనిబ్రత మజీ 300లకు 300 మార్కులతో సత్తా చాటారు. దేశవ్యాప్తంగా 14 మంది విద్యార్థులు 300 మార్కులు సాధించగా, తెలంగాణ నుంచి ఒకే ఒక్క విద్యార్థి బనిబ్రత మజీ వంద శాతం మార్కులతో ఆలిండియా ఓపెన్ కోటా టాపర్‌లలో ఒకడిగా నిలిచాడు. ఈ 14 మందిలో ఏపీకి చెందిన గుత్తికొండ సాయిమనోజ్ణ ఒక్కరే అమ్మాయి. అత్యధికంగా రాజస్థాన్ నుంచి ఐదుగురికి వంద శాతం మార్కులు వచ్చాయి. జేఈఈ మెయిన్ -1 పరీక్షలను జనవరి 22 నుంచి 29 తేదీ వరకు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా 13,11,544 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 12,58,136 మంది పరీక్షకు హాజరయ్యారు. ప్రస్తుతం పేపర్ -1(బీఈ, బీటెక్) ఫలితాలు విడుదల చేయగా, పేపర్ -2 (బీ ఆర్క్, బీ ప్లానింగ్) ఫలితాలను తర్వాత విడుదల చేయనున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) ప్రకటించింది.

ఛాయిస్ ప్రశ్నల ఎత్తివేత ఎఫెక్ట్

ఈసారి జేఈఈ ఫలితాలు నిరాశపరిచాయనే చెప్పుకోవచ్చు. గతంతో పోల్చితే 300కు 300 మార్కులు సాధించిన వారు తక్కువగా ఉన్నారు. ఛాయిస్ ప్రశ్నలను తొలగించిన ప్రభావం ఫలితాల్లో స్పష్టంగా కనిపించింది. ఇది వరకు జేఈఈ మెయిన్ సెక్షన్ -బీలో ఛాయిస్ ప్రశ్నలు ఉండేవి. 10 ప్రశ్నలు ఇచ్చి, 5 ప్రశ్నలు రాసే అవకాశముండేది. ఇప్పుడు మాత్రం ఐదింటికి ఐదు జవాబులు రాయాల్సి ఉంటుంది. దీంతో వంద శాతం మార్కులు రావడం కష్టంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఏప్రిల్ 1 నుంచి మెయిన్ -2 పరీక్షలు

జేఈఈ మెయిన్ -2 పరీక్షలు ఏప్రిల్ 1 నుంచి 8 వరకు జరగనున్నాయి. మెయిన్ -1లో సాధించిన స్కోర్‌తో సంతృప్తి చెందని వారు మెయిన్ -2 పరీక్షలకు హాజరుకావచ్చు. ఈ రెండు పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ఉత్తమ స్కోర్ పరిగణనలోకి తీసుకుని జేఈఈ మెయిన్ తుది ర్యాంకులను కేటాయిస్తారు. మెయిన్‌లో ఉత్తీర్ణత సాధించిన 2.5 లక్షల మంది విద్యార్థులను జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఎంపికచేస్తారు.

ఆటలతో ఒత్తిడిని జయించా - బనిబ్రత మజీ

జేఈఈ కోసం చాలా శ్రమించా. రోజుకు 12 -14 గంటల పాటు కష్టపడ్డా. కెమిస్ట్రీ చాలా కష్టంగా అనిపించినా సవాల్‌గా తీసుకుని ప్రిపేరయ్యా. పొరపాట్లు గుర్తించి, వాటిపై ఎక్కువగా దృష్టి పెట్టా. ప్రిపరేషన్ సమయంలో ఒత్తిడికి గురయ్యా. చెస్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ ఆడి ఒత్తిడిని దూరం చేసుకునేవాడిని. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించి, ఐఐటీ బాంబేలో చేరడమే నా లక్ష్యం.

దేశంలో పెరుగుతున్న అవినీతి

అవినీతి సూచీలో ఏటా దిగజారుతున్న భారత ర్యాంకు

బెర్లిన్, ఫిబ్రవరి 11: దేశంలో అవినీతి ఏటా పెరుగుతున్నది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ అనే సంస్థ వెలువరించిన వార్షిక కరప్షన్ పర్సెప్షన్స్ ఇండెక్స్(సీపీఐ)-2024 నివేదికలో భారత్ ర్యాంకు మరింత దిగజారింది. 2023లో 93వ ర్యాంకులో ఉండగా, 2024లో 96కి పడిపోయింది. 180 దేశాలకు ప్రతియేటా స్కోర్, ర్యాంకులను ఇస్తారు. 100 పాయింట్లకు గానూ ఇచ్చే స్కోర్‌లో తక్కువ పాయింట్లు సాధించిన దేశాల్లో ఎక్కువ అవినీతి ఉన్నట్టు, ఎక్కువ పాయింట్లు సాధించిన దేశాల్లో తక్కువ అవినీతి ఉన్నట్టు లెక్క.



అదానీ కేసు అటకెక్కినట్టే?

- ఎఫ్‌సీపీఏను నిలిపేస్తూ ట్రంప్ కార్యనిర్వాహక ఆదేశం
- ఇదే చట్టం కింద అదానీపై అమెరికాలో అభియోగాలు
- మోదీ అమెరికా పర్యటన ముందు కీలక పరిణామం

ఈ చట్టం కిందే అదానీపై అభియోగాలు

వాషింగ్టన్, ఫిబ్రవరి 11: అమెరికాలో అమలులో ఉన్న ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్(ఎఫ్‌సీపీఏ)ను నిలిపివేయాలని న్యాయ శాఖను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను జారీ చేశారు. ఈ చట్టం వినడానికి బాగానే ఉన్నా దేశానికి నష్టం చేస్తున్నదని, జైలు భయంతో అమెరికా కంపెనీలు ఒప్పందాలు కుదుర్చుకోలేకపోతున్నాయని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికన్ కంపెనీలు అంతర్జాతీయంగా చట్టాలను ఉల్లంఘనలకు పాల్పడకుండా 1977లో అమెరికా ఈ చట్టాన్ని చేసింది. అమెరికాలో లంచాలు ఇచ్చే విదేశీయులు, విదేశీ సంస్థలను కూడా ఈ చట్టం పరిధిలోకి తెస్తూ 1998లో సవరించారు.

ఈ చట్టం కిందే అదానీపై అభియోగాలు ఎఫ్‌సీపీఏను నిలిపివేయడం గౌతమ్ అదానీకి భారీ ఊరట కలిగించనుంది. అదానీ, ఆయన అనుచరులు భారత్‌లో విద్యుత్తు కాంట్రాక్టులు పొందేందుకు భారతీయ అధికారులకు భారీగా లంచాలు ఎర వేశారని గత ఏడాది అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్(డీఓజే) ఈ చట్టం కిందనే అభియోగాలు మోపింది. అదానీ సంస్థల్లో కొందరు పెట్టుబడిదారులు అమెరికన్లు కావడంతో ఈ చట్టం వర్తించింది. ఇప్పుడు ఈ చట్టాన్నే నిలిపివేస్తూ ట్రంప్ ఉత్తర్వులు ఇవ్వడంతో అదానీ సంస్థపై విచారణ నిలిచిపోయే అవకాశం ఉంది. కాగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనకు ఒక రోజు ముందు ట్రంప్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ నెల 12, 13 తేదీల్లో మోదీ అమెరికాలో పర్యటించనున్నారు.

చెన్నైలో ఓ వీధికి ఎస్పీబీ పేరు

నేమ్‌బోర్డు ఆవిష్కరించిన ఉదయనిధి

చెన్నై, ఫిబ్రవరి 11: దివంగత ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పేరిట మార్చిన నగరంలోని ఓ వీధి నామఫలకాన్ని తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ మంగళవారం ఆవిష్కరించారు. ఎస్పీబీగా ప్రసిద్ధి పొందిన బాలసుబ్రహ్మణ్యం నివసించిన నుంగంబాకం ప్రాంతంలోని కాందార్ నగర్ మెయిన్ రోడ్డును ఆయన గౌరవార్థం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం శాలైగా మారుస్తూ ఇటీవలే ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం శాలై నామఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఉదయనిధి ఆయన నివాసాన్ని సందర్శించి ఎస్పీబీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఎస్పీబీ కుటుంబ సభ్యులతో ఉదయనిధి మాట్లాడారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ తదితర భాషలలో 40 వేలకు పైగా సినీగీతాలు ఆలపించిన ఎస్పీబీ కరోనాబారినపడి చికిత్స పొందుతూ 2020 సెప్టెంబర్‌లో కన్నుమూశారు.

భారత్‌లో పెరిగిన విద్వేష ప్రసంగాలు

- 2023 కంటే 2024లో 74 శాతం అధికం

వాషింగ్టన్, ఫిబ్రవరి 11: భారత్‌లో గత ఏడాది విద్వేషపూరిత ప్రసంగాలు భారీగా పెరిగాయని వాషింగ్టన్ కేంద్రంగా పని చేసే సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ ఆర్గనైజ్డ్ హేట్(సీఎస్ఓహెచ్)లోని ఇండియా హేట్ ల్యాబ్ పేర్కొన్నది. 2024 ఏడాదిలో భారత్‌లో ద్వేషపూరిత ప్రసంగాలపై ఈ సంస్థ సోమవారం నివేదికను వెలువరించింది. 2024లో దేశంలో 1,165 విద్వేష ప్రసంగాలు ఇచ్చారని, ఇది 2023 కంటే 74 శాతం అధికమని ఈ నివేదిక పేర్కొన్నది. సాధారణ ఎన్నికల వేడి పతాక స్థాయిలో ఉన్న మే నెలలో ఎక్కువగా ఈ ప్రసంగాలు చేసినట్టు వెల్లడించింది. విద్వేష ప్రసంగాలు చేసిన వారిలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా లాంటి అనేక మంది రాజకీయ నేతలు ఉన్నట్టు తెలిపింది.ముస్లింల తర్వాత క్రైస్తవులను లక్ష్యంగా ఈ విద్వేష ప్రసంగాలు చేసినట్టు వెల్లడించింది. బీజేపీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో విద్వేష ప్రసంగాలు ఎక్కువగా చేసినట్టు తెలిపింది. 2024లో భారత్‌లో నమోదైన మొత్తం విద్వేష ప్రసంగాల్లో సగానికి పైగా బీజేపీ పాలిత రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లోనే చేసినట్టు వెల్లడించింది.

నేడు 'నో వెహికిల్ జోన్'గా ప్రయాగ్‌రాజ్

మాఘ పూర్ణిమ కోసం భారీ భద్రత

పయాగ్‌రాజ్, ఫిబ్రవరి 11: మాఘ పూర్ణిమను పురస్కరించుకుని బుధవారం భారీ స్థాయిలో మహా కుంభ మేళాను సందర్శించే ప్రజలను నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రయాగ్‌రాజ్‌లో ట్రాఫిక్ ఆంక్షలను విధించింది. ఫిబ్రవరి 8వ తేదీ నుంచి మహా కుంభమేళాకు వెళ్లే దారులన్నీ 300 కిలోమీటర్ల దూరం వరకు వాహనాలతో కిక్కిరిసిపోయాయి. మాఘ పూర్ణిమ మంగళవారం సాయంత్రం 6.55 గంటలకు ప్రారంభమై బుధవారం రాత్రి 7.22 గంటలకు ముగుస్తుంది. మంగళవారం తెల్లవారుజాము 4 నుంచి మేళా ప్రాంతాన్ని 'నో వెహికిల్ జోన్'గా అధికారులు ప్రకటించారు. అత్యవసర, నిత్యావసర సర్వీసులకు చెందిన వాహనాలను మాత్రమే అనుమతిస్తారు.

హజ్‌లో పిల్లల ప్రవేశంపై నిషేధం

న్యూఢిల్లీ: ఈ ఏడాది(2025) హజ్ యాత్రకు సంబంధించి కీలకమైన కొన్ని మార్పులను సౌదీ అరేబియా మంగళవారం ప్రకటించింది. హజ్ యాత్రలో పిల్లల ప్రవేశాన్ని నిషేధిస్తున్నట్టు వెల్లడించింది. హజ్ యాత్ర సందర్భంగా భారీ సంఖ్యలో యాత్రికుల రాకను దృష్టిలో ఉంచుకుని పిల్లల భద్రత కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు హజ్ మంత్రిత్వశాఖ, ఉమ్రా ప్రకటించాయి. అంతేగాక, ఈ ఏడాది హజ్ యాత్రలో మొదటిసారి వచ్చే భక్తులకు ప్రాధాన్యం ఇస్తున్నామని సౌదీ అధికారులు తెలిపారు.

హెచ్‌ఏఎల్‌పై నమ్మకం లేదు

తేజస్ యుద్ధ విమానాల తయారీ ఆలస్యంపై ఐఏఎఫ్ చీఫ్ అసంతృప్తి

బెంగళూరు, ఫిబ్రవరి 11: హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్) తయారు చేస్తున్న తేజస్ ఎంకే1ఏ యుద్ధ విమానాల ఆలస్యంపై భారత వాయుసేన చీఫ్ ఏపీ సింగ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బెంగళూరులో జరుగుతున్న ఏరో ఇండియా షోను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఓ యుద్ధవిమానాన్ని పరిశీలిస్తూ.. హెచ్‌ఏఎల్ అధికారులతో మాట్లాడిన వీడియో వైరల్‌గా మారింది. 'ఫిబ్రవరి నాటికి 11 యుద్ధవిమానాలు తయారవుతాయని నాకు హామీ ఇచ్చారు. ఇప్పటికి ఒక్కటి కూడా తయారుకాలేదు. హెచ్‌ఏఎల్ మన సొంత సంస్థ. నేను కూడా ఇందులో పనిచేశా. కానీ ఇక్కడ పనులు యుద్ధ ప్రాతిపదికన జరగడం లేదు. ఇప్పుడైతే నాకు హెచ్‌ఏఎల్‌పై నమ్మకం లేదు' అని ఆయన వ్యాఖ్యానించినట్టు వీడియోలో కనిపిస్తున్నది. కాగా, 2010లో ఆర్డర్ ఇచ్చిన 40 తేజస్ ఎంకే1 యుద్ధవిమానాలు ఇప్పటికీ పూర్తిగా తమకు అందలేదని ఇటీవల ఏపీ సింగ్ అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

ఏఐ కోసం ప్రపంచ విధానం అవసరం

ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ(ఏఐ) కోసం ప్రపంచ విధానాన్ని రూపొందించేందుకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఏఐపై విశ్వాసం, పారదర్శకత, నిష్పాక్షికత పెంపొందేందుకు ఈ విధానం దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయెల్ మాక్రాన్‌తో కలిసి ఏఐ కార్యాచరణ సదస్సుకు అధ్యక్షత వహించిన ప్రధాని మోదీ ఈ సందర్భంగా ప్రసంగిస్తూ రాజకీయ, ఆర్థిక, భద్రత, సమాజం వంటి అన్ని రంగాలను ఏఐ మార్చివేస్తోందని తెలిపారు. విలువలు, విశ్వాసం పెంపునకు, ముప్పుల పరిష్కారానికి ఉపయోగపడే విధంగా ఏఐ కోసం ఓ సమగ్ర విధానాన్ని రూపొందించేందుకు ప్రపంచ దేశాలు కలసికట్టుగా కృషి చేయాలన్నారు.

'విశ్వ గురువు'గా శ్రీల ప్రభుపాదులు

బిరుదు ప్రదానం చేసిన భారతీయ అఖాఢ పరిషత్

హైదరాబాద్, ఫిబ్రవరి 11: ఇస్కాన్, హరే కృష్ణ ఉద్యమ వ్యవస్థాపకుడు, సాంస్కృతిక రాయబారి శ్రీల ప్రభుపాదులకు అఖిల భారతీయ అఖాఢ పరిషత్ 'విశ్వగురు' బిరుదుతో సత్కరించింది. మహా కుంభమేళా సందర్భంగా అఖాఢ పరిషత్ అధ్యక్షుడు హెచ్ మహంత్ పూరిజీ మహారాజ్, వివిధ అఖాఢాల నుంచి విచ్చేసిన మహా మండలేశ్వరులు, సీనియర్ సాధువులు, వేలాది మంది భక్తుల సమక్షంలో శ్రీల ప్రభుపాదులకు ఈ బిరుదును ప్రదానం చేశారు. చరిత్రలో ఈ బిరుదును పొందిన తొలి, ఏకైక వ్యక్తి శ్రీల ప్రభుపాదులని వక్తలు ప్రశంసించారు. శ్రీకృష్ణుని సందేశాన్ని ప్రచారం చేయడానికి ఆయన చేసిన మార్గదర్శక ప్రయత్నాలు ఫలించి లక్షలాది మంది ఆ బాటలో నడిచారని గ్లోబల్ హరే కృష్ణ ఉద్యమ చైర్మన్, గురువు మధు పండిట్ దాసు ప్రశంసించారు. ఇస్కాన్ బెంగళూరు సీనియర్ వైస్ ప్రెసిడెంట్ చంచలపతి దాసు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆచార్య మహా మండలేశ్వర్ అవధూత్ అరుణ్ గిరీ జీ మహారాజ్, నిరంజనీ పీఠాధీశ్వరుడు స్వామి కైలాసనంద గిరి మహారాజ్, అఖాఢ పరిషత్ అధ్యక్షుడు మహంత్ రవీంద్ర పూరి జీ మహారాజ్ పాల్గొన్నారు.

ఐదు రోజులు కుటుంబం మొత్తం డిజిటల్ అరెస్ట్

1.1 కోట్లు కాజేసిన కేటుగాళ్లు

ముంబై, ఫిబ్రవరి 11(నమస్తే తెలంగాణ): మనీలాండరింగ్‌లో భాగస్వాములయ్యారంటూ సైబర్ నేరగాళ్లు ముంబైలో ఒక ఎల్ఐసీ రిటైర్డ్ మేనేజర్, అతని కుటుంబం నుంచి రూ.1.10 కోట్లను దోచుకున్నారు. ఫిబ్రవరి 1న చంద్రభాన్ పలివాల్‌కు సైబర్ నేరగాళ్లు ఫోన్ కాల్ చేసి, వివిధ రకాలుగా అతడ్ని బెదిరించారు. వీడియో కాల్‌లో అనేక రకాలుగా భయభ్రాంతులకు గురిచేస్తూ, ఐదు రోజుల పాటు చంద్రభాన్ కుటుంబాన్ని డిజిటల్ అరెస్ట్ చేశారు. మీపై 24 కేసులున్నాయంటూ.. చంద్రభాన్ బ్యాంక్ ఖాతా నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు డ్రా చేసి, మరో బ్యాంక్‌కు తరలించారు. జరిగిన సంగతి తెలుసుకున్నాక పోలీసులు సైతం షాక్‌కు గురయ్యారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. బెంగళూరులోని ఖాతాకు నగదు బదిలీ అయినట్లు ప్రాథమికంగా పోలీసులు గుర్తించారు.

వారసత్వ పన్నును నిరసిస్తూ బ్రిటన్ వ్యాప్తంగా ఆ దేశ రైతులు సోమవారం ట్రాక్టర్లతో లండన్‌కు కదం తొక్కారు. కీవ్ స్టార్మర్ సర్కారు ప్రతిపాదించిన వారసత్వ పన్ను బిల్లుకు వ్యతిరేకంగా లండన్ వీధుల్లో నిరసనలు చేపట్టారు. సెంట్రల్ లండన్‌లోని పార్లమెంట్ స్క్వేర్‌కు చేరుకొని ఆందోళనలు చేశారు. అయితే, వందలాది ట్రాక్టర్లతోపాటు మార్చ్‌లో పాల్గొన్న ఓ యుద్ధ ట్యాంకు అందరి దృష్టినీ ఆకర్షించింది. యూనియన్ జాక్ జెండా (ఇంగ్లండ్, స్కాట్లాండ్, ఐర్లాండ్-గ్రేట్ బ్రిటన్), 'మన రైతులతో పాటు' అనే ప్లకార్డుతో ఉన్న యుద్ధ ట్యాంకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనల్లో పాల్గొంది.

రష్యాలో ఉక్రెయిన్ భాగం కావొచ్చు!: ట్రంప్

వాషింగ్టన్, ఫిబ్రవరి 11: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రోజుకో ప్రకటనతో సంచలనం సృష్టిస్తున్నారు. తాజాగా ఆయన రష్యా, ఉక్రెయిన్ యుద్ధంపై నర్మగర్భంగా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భవిష్యత్తులో రష్యాలో ఉక్రెయిన్ భాగం కావొచ్చు, కాకపోవచ్చు, ఆ రెండు దేశాలు ఒక ఒప్పందానికి రావొచ్చు అని ట్రంప్ తెలిపారు. ఒక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధాన్ని ఆపేందుకు అవసరమైన ప్రయత్నాలన్నీ చేస్తున్నామని చెప్పారు.

శనివారంలోగా బందీలను విడిచిపెట్టండి

గాజాలో హమాస్ వద్ద బందీలుగా ఉన్న ఇజ్రాయెల్ పౌరులను శనివారం మధ్యాహ్నం లోగా విడిచిపెట్టాలని ట్రంప్ అల్టిమేటం జారీ చేశారు. అలా చేయకపోతే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ముగించాలని ప్రతిపాదిస్తామని అన్నారు. కాగా,ఇప్పటివరకు ఉన్న గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును గూగుల్ మ్యాప్ ఇక నుంచి గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చింది.

రోజూ ఆఫీసుకు ప్లైట్‌లో!

- మలేషియాలో నిత్యం 700 కి.మీ.పైగా
- భారత సంతతి మహిళ రాకపోకలు
- ఈ పద్ధతే చౌకగా ఉన్నట్టు కౌర్ వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: విధి నిర్వహణ కోసం సకాలంలో కార్యాలయాలకు వెళ్లి వచ్చేందుకు రోజూ ఎంతో మంది ఉద్యోగులు కార్లు, బస్సులు, రైళ్లు, షేర్డ్ ట్యాక్సీలను ఆశ్రయిస్తుంటారు. కానీ, మలేషియాలోని పెనాంగ్ రాష్ట్రంలో నివసిస్తున్న భారత సంతతి మహిళ, ఇద్దరు పిల్లల తల్లి రాచెల్ కౌర్ మాత్రం ఉద్యోగ బాధ్యతల నిర్వహణకు నిత్యం ఏకంగా 700 కిలోమీటర్లకుపైగా దూరం చొప్పున వారానికి 5 రోజులపాటు విమానాల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ప్రముఖ విమానయాన సంస్థ 'ఎయిర్ ఏషియా'లో ఫైనాన్స్ ఆపరేషన్స్ విభాగ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న రాచెల్ కౌర్ 'సీఎన్ఏ' ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. రోజూ ఉదయం 6.30 గంటలకు విమానంలో బయల్దేరి 7.45 గంటలకు కౌలాలంపూర్‌లోని కార్యాలయానికి చేరుకుంటున్నానని, అక్కడ పని పూర్తయ్యాక రాత్రి 8 గంటలకు ఇంటికొచ్చి పిల్లలను చూసుకోగలుగుతున్నానని వివరించారు. దీనివల్ల ఉద్యోగ-కుటుంబజీవితం సమతూకంగా ఉండటంతోపాటు ప్రతినెలా రూ.14 వేలు ఆదా అవుతున్నాయని చెప్పారు.

డ్రోన్ దాడుల నుంచి రక్షణ

- కౌంటర్ డ్రోన్ వ్యవస్థ ఆవిష్కరణ
- అభివృద్ధి చేసిన అదానీ డిఫెన్స్, డీఆర్డీవో

బెంగళూరు, ఫిబ్రవరి 11: డ్రోన్ దాడులను అడ్డుకునే కొత్త వెహికిల్ మౌంటెడ్ కౌంటర్ డ్రోన్ వ్యవస్థను మంగళవారం ఆవిష్కరించారు. అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, డీఆర్డీవో కలిసి ఈ వ్యవస్థను అభివృద్ధి చేశాయి. బెంగళూరులో జరుగుతున్న ఏరో ఇండియా ప్రదర్శనలో డీఆర్డీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్ బీకే దాస్ దీనిని ఆవిష్కరించారు. వాహనంలో అమర్చి ఉండే ఈ కౌంటర్ డ్రోన్ వ్యవస్థ ద్వారా డ్రోన్ దాడులను సమర్థంగా అడ్డుకోవచ్చు. దీనికి అత్యాధునిక లేజర్, రాడార్ వ్యవస్థలు, ఎలక్ట్రో ఆప్టికల్ సెన్సార్లు, జామర్లతో పాటు 7.62 ఎంఎం గన్ ఉంటాయి. 10 కిలోమీటర్ల పరిధిలో డ్రోన్లను ఇది కూల్చేయగలదు.

బెంగళూరు మెట్రో చార్జీల పెంపుపై భగ్గు

ఎక్స్‌లో ట్రెండింగ్‌లో బాయ్‌కాట్ మెట్రో

బెంగళూరు, ఫిబ్రవరి 11: కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కార్ మెట్రో రైలు చార్జీలను పెంచడం పట్ల పౌరులు భగ్గుమంటున్నారు. నమ్మా మెట్రో చార్జీలను 50 శాతం పెంచుతున్నట్టు బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ (బీఎంఆర్‌సీఎల్) ఇటీవల ప్రకటించింది. దీనిపై పలు వర్గాలు మండిపడుతున్నాయి. ఈ చార్జీ